క్లుప్తంగా

స్థల పరిశీలన

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో వినాయక నిమజ్జనాలకు ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డితో పాటు గ్రామ కార్యదర్శి చెరువుల వద్ద స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు మండల కేంద్రంలోని మల్కా చెరువులో వినాయక నిమజ్జనాలకు అనువైన స్థలాన్ని పరిశీలించారు. చెరువుల వద్ద వచ్చే భక్తులు నిమజ్జనాలు చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రజాక్ ఇతరులు ఉన్నారు.

మండపాల వద్ద జాగ్రత్తలు పాటించాలి: ఎస్‌ఐ

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద సరైన జాగ్రత్తలు పాటించాలని ఎస్‌ఐ యాదగిరి అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని అజ్జమర్రి గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండపాల వద్ద రాత్రి సమయంలో నలుగురు సభ్యులు ఉండి, విద్యుత్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా సాధ్యమైనంత వరకు డీజేలు వాడకూడదన్నారు. నిమజ్జన సమయంలో సరైన జాగ్రత్తలు పాటించాలని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉత్సవాలను జరుపుకోవాలన్నారు.

కూలిన ఇళ్ల పరిశీలన

నిజాంపేట(మెదక్): కొన్ని రోజులుగా కురిసిన భారీ వర్షాలకు మండల పరిధిలోని నందగోకుల్ గ్రామంలో మంగళవారం నివాస గృహాలు కూలిపోవడంతో ఆర్‌ఐ గంగాధర్‌గౌడ్ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కూలిపోయిన ఇళ్లను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపించనున్నట్లు తెలిపారు. బాధితులకు నష్ట పరిహారం అందేలా కృషి చేస్తామన్నారు.

ఆత్మహత్యలకు పాల్పడవద్దు



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

రామాయంపేట(మెదక్): ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో పాటు ఆవాసం విద్యార్థులు రామాయంపేటలో ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు విద్యార్థుల సమక్షంలో సీఐ వెంకట్ రాజాగౌడ్, ఎస్‌ఐ బాలరాజు, తదితరులు కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మనిషి ఏదైనా సమస్య ఎదురైతే బతికుండి సాధించాలని సూచించారు. ఆత్మహత్య చేసుకోవడం పిరికిపందల చర్యగా అభివర్ణించారు. విద్యార్థులను చైతన్యపర్చడానికే తాము కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు భానుచందర్, ఆవాసం ఉపాధ్యాయుడు శ్రీనివాస్, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత ట్యూషన్



చిన్నారులకు ట్యూషన్ చెప్తున్న నర్సమ్మ

మెదక్ కలెక్టరేట్: పోరాట యోధుల స్ఫూర్తితో పేద పిల్లలకు ఉచిత ట్యూషన్ చెప్తున్నామని యూటీఎఫ్ మెదక్ జిల్లా కార్యదర్శి పద్మారావు తెలిపారు. మంగళవారం పట్టణంలోని కేవల్ కిషన్ భవన్‌లో ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద పిల్లలకు ఉచిత ట్యూషన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో కేవల్ కిషన్ ట్రస్ట్ నిర్వాహకులు నర్సమ్మ, కృప, విద్యార్థులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ నూతన కార్యవర్గం

చిన్నశంకరంపేట(మెదక్): టీపీటీఎఫ్ చిన్నశంకరంపేట మండల కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీపీటీఎఫ్ మండలాధ్యక్షుడిగా ఫణీంద్రచారి, ప్రధాన కార్యదర్శిగా వేణుగోపాల్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఎన్.ప్రభు, ఎస్.మంగ, కార్యదర్శుగా ఎన్.యాదగిరి, కె.భవాని, జిల్లా కౌన్సిలర్లుగా శ్రీనివాస్‌రెడ్డి, రాములు, అన్నపూర్ణ, శ్రవణ్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారిగా శ్రీనివాస్‌రెడ్డి, పరిశీలకులుగా శశిధర్‌రెడ్డి వ్యవహరించారు.

నేటి నుంచి ఐటీఐలో అడ్మిషన్లు

మెదక్ కలెక్టరేట్: మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్ల భర్తీ కోసం బుధవారం నుంచి ఆన్‌లైన్ అప్లికేషన్లు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ నందు కోపా (కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ (ట్రేడ్), డీజిల్ మెకానిక్, ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ ట్రేడ్లలో సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. సీట్ల భర్తీ కోసం పదో తరగతి పాసైన ఆసక్తిగల అభ్యర్థులు ప్రభుత్వ ఐటీఐ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 20వ తేదీ వరకు దరఖాస్తుల ప్రక్రియ ఉంటుందన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



తూప్రాన్: అవగాహన కల్పిస్తున్న శివకుమారి

ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ సంతోష



శివ్వంపేట(నర్సాపూర్): కొంతాన్‌పల్లిలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సంతోష

శివ్వంపేట(నర్సాపూర్): పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ సంతోష అన్నారు. పోషణ మాసోత్సవంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ బీ పడాయి బీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తెలిపారు. మంగళవారం మండలంలోని కొంతాన్‌పల్లిలో అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం పోషణ మాసోత్సవం రెండో వారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లలకు కథలు చెప్పి, కథలోని నీతిని నేర్పించాలని చెప్పారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తప్పక పోషణ మాసోత్సవాలను నిర్వహించాలని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సబిత, సులోచన, లబ్ధిదారులు పాల్గొన్నారు.

తూప్రాన్: గర్భిణులు, బాలింతలు పోషకాలు కలగిన ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివకుమారి అన్నారు. పోషకాహార మసోత్సవ కార్యక్రమం పట్టణంలోని అంగన్‌వాడీ–5వ కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలకు గర్భిణులకు సమతుల ఆహారంపై అవగాహన కల్పించారు. అనంతరం పోషణ, పూర్వ ప్రాథమిక విద్య కార్యక్రమాలపై ప్రతిజ్ఞ చేయించారు.

పర్మిషన్ ఇవ్వని పంచాయతీ కార్యదర్శి

డీపీఓకు ఫిర్యాదు చేసిన మాజీ ఎంపీటీసీ



కార్యదర్శిని ప్రశ్నిస్తున్న ఎంపీడీఓ

కౌడిపల్లి(నర్సాపూర్): మూడు నెలలుగా ఇంటి నిర్మాణానికి పర్మిషన్ ఇవ్వకుండా పంచాయతీ కార్యదర్శి ఇబ్బందులకు గురిచేస్తుందని తిమ్మాపూర్ మాజీ ఎంపీటీసీ శంకర్‌గౌడ్ డీపీఓకు ఫిర్యాదు చేశారు. దీంతో మంగళవారం ఎంపీడీఓ శ్రీనివాస్ బాధితుడిని, పంచాయతీ కార్యదర్శి సుజాతను సమస్య అడిగి తెలుసుకున్నారు. వివరాల ప్రకారం .. తిమ్మాపూర్ మాజీ ఎంపీటీసీ శంకర్‌గౌడ్ గ్రామం సమీపంలోని తన సొంత వ్యవసాయ భూమిని ఇంటి నిర్మాణానికి పర్మిషన్‌కు దరఖాస్తు చేశాడు. కార్యదర్శి మాత్రం మూడు నెలలుగా తిప్పుతూ అనుమతి ఇవ్వలేదు. దీంతో డీపీఓ యాదయ్యకు ఫిర్యాదు చేశాడు. డీపీఓ ఆదేశాలతో మంగళవారం ఎంపీడీఓను ఎంపీటీసీ, పంచాయతీ కార్యదర్శిని పిలిచి ప్రశ్నించారు. వెంటనే పర్మిషన్ ఇవ్వాలని ఆదేశించారు. కాగా దరఖాస్తు రిజక్ట్ అయిందని, తిరిగి మీసేవాలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో పంచాయతీ కార్యదర్శిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

శివ్వంపేట(నర్సాపూర్): ఇళ్లకు గొళ్లెం పెట్టి, తాళం వేసిన ఇంటిలో చోరీ చేసిన సంఘటన మండల కేంద్రం శివ్వంపేటలో జరిగింది. మంగళవారం బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శివ్వంపేట పోలీస్‌స్టేషన్ సమీపంలోని శ్రీనివాస్‌గౌడ్ తన ఇంటికి తాళం వేసి, బతుకుదెరువు కోసం వరంగల్ వెళ్లాడు. సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దొంగలు శ్రీనివాస్‌గౌడ్ అన్నదమ్ముల ఇళ్లకు బయట నుంచి గొళ్లెం పెట్టారు. శ్రీనివాస్‌గౌడ్ ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లోని చీరలు, నిత్యావసర వస్తువులు, రూ. 6వేలు నగదు చోరీ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ముదిరాజ్‌లను బీసీ–ఏలోకి మార్చాలి'



మాట్లాడుతున్న రాజు

రామాయంపేట(మెదక్): ముదిరాజ్‌లను బీసీ–ఏలోకి మార్చాలని ముదిరాజ్ మహాసభ ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు పుట్టి రాజు పేర్కొన్నారు. మంగళవారం పెద్దమ్మ ఆలయం వద్ద జరిగిన సంఘం సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సంస్థల ఎన్నికల్లో రాజకీయ పునాది వేయాలని అన్నారు. ముదిరాజ్ కులస్తులను బీసీ–డీ నుంచి బీసీ – ఏలోకి మార్చాలని డిమాండ్ చేశారు. సంఘంలోని యువత ముందుకు వస్తే చాలా వరకు సమస్యలు పరిష్కారమవుతాయని, భవిష్యత్ తరాలకు మనం ఆదర్శంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈనెల 22న రామాయంపేటలో జరిగే జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో సభ్యులు పాల్గొనాలని సూచించారు. అంతకుముందు సమావేశానికి సంబంధించి కరపత్రాలు విడుదల చేశారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భిక్షపతి, నాయకులు గంగారాంలు, భాగయ్య తదితరులు పాల్గొన్నారు.



నర్సాపూర్: పూజల్లో పాల్గొన్న సీఐ, ఎస్‌ఐ, ఆర్యవైశ్య సంఘం నాయకులు



రేగోడ్(మెదక్): పూజలు చేస్తున్న భక్తులు

వినాయకుడికి భక్తిశ్రద్ధలతో పూజలు

రేగోడ్(మెదక్): మండల కేంద్రంలో భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి నిర్వాహకులు భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తున్నారు.

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో వినాయక మండపాల వద్ద అన్నదానం నిర్వహించారు.

సామూహిక కుంకుమార్చన

పెద్దశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని తిరుమలాపూర్ కాలనీలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. మంగళవారం ఆయా గ్రామాల్లో ప్రతిష్ఠించిన మండపాల వద్ద భక్తులు వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మహిళా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షురాలు రాగం అర్చన, ప్రధాన కార్యదర్శి చకిలం విశాల, మాజీ వైస్ ఎంపీపీ కన్నయ్యగారి లక్ష్మి తదితరులు ఉన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

నర్సాపూర్: నర్సాపూర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణపతి వద్ద పోలీసు అధికారులు పూజలు చేశారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం సభ్యులు సీఐ జాన్‌రెడ్డి, ఎస్‌ఐ లింగంలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లి మార్కెట్‌లోని వినాయక మండపం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేసి భజన చేశారు.

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని జంబికుంట సూర్య వినాయక మండపంలో గణపతి హోమం నిర్వహించారు.



పెద్దశంకరంపేటలో సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు



కౌడిపల్లి(నర్సాపూర్): భజన చేస్తున్న భక్తులు



మెదక్ మున్సిపాలిటీ: హోమం నిర్వహిస్తున్న భక్తులు

విద్యార్థులకు గణితశాస్త్ర పరీక్షలు



చిన్నశంకరంపేట(మెదక్): ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పరీక్షలు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని పాఠశాల విద్యార్థులలోని గణితశాస్త్ర ప్రతిభను వెలికితీసేందుకు విద్యార్థులకు గణితశాస్త్ర సామర్థ్య పరీక్షలు నిర్వహించారు. మంగళవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 3, 6, 9వ తరగతి విద్యార్థులకు గణిత శాస్త్రం పరీక్షలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం విద్యార్థుల్లోని సామర్థ్య ప్రతిభను గుర్తించేందుకు పరీక్షలు నిర్వహించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

ఎన్‌ఏఎస్ పరీక్ష

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలోని ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎస్‌పీడీ ఆదేశాలతో ఎన్‌ఏఎస్ (నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే) నమూన పరీక్షను నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం పద్మజ, పీడీ రమేశ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. పరీక్షల నిర్వహణతో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరగడంతో పాటు వారిలో దాగి ఉన్న ప్రతిభ బయటకు వస్తుందని చెప్పారు.



రేగోడ్(మెదక్): నివాళులర్పిస్తున్న నాయకులు



తూప్రాన్‌లో..



నిజాంపేటలో..

వీరవనిత ఐలమ్మ అందరికీ ఆదర్శం

జిల్లా వ్యాప్తంగా మంగళవారం చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటాలకు, విగ్రహాలకు నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. రజాకార్లను తరిమి కొట్టిన వీర వనిత చాకలి ఐలమ్మ అందరికీ ఆదర్శప్రాయురాలని కొనియాడారు.



నర్సాపూర్‌లో చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు



వెల్దుర్తి(తూప్రాన్): నివాళులర్పిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి



కౌడిపల్లి(నర్సాపూర్): వెల్మకన్నలో..



పాపన్నపేటలో..

సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్తా చాటాలి

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి



సాఫ్ట్‌బాల్ ఆడుతున్న రాజిరెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): సాఫ్ట్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్టు సత్తాచాటాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి అన్నారు. మండల కేంద్రం మాసాయిపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సాఫ్ట్‌బాల్ జిల్లా జట్లను ఎంపిక చేశారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 100 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో ఒకప్పుడు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ వంటి క్రీడలే ఆడేవారని, ప్రస్తుతం అన్ని పోటీల్లో విద్యార్థులు రానిస్తున్నారని అన్నారు. అంతకుముందు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు నరేందర్ రెడ్డి, మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, సాఫ్ట్ బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్‌శర్మ, కోశాధికారి గోవర్ధన్, హెచ్‌ఎం ధర్మపురి, ఉపాధ్యాయులు రంగారెడ్డి, హరిరంజన్‌శర్మ, రాజేశ్వర్‌రావ్, మాజీ ఎంపీటీసీలు సిద్ది రాములుగౌడ్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పండగలు శాంతియుతంగా జరుపుకోవాలి :ఎస్పీ



రామాయంపేట(మెదక్): మిలాద్ ఉన్ నబీ, వినాయక నిమజ్జనం పండుగల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సర్కిల్‌కు సంబంధించి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలు శాంతియుతంగా పండగలు నిర్వహించుకోవాలని సూచించారు. అంతకుముందు సర్కిల్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో పెండింగ్ కేసుల విషయమై ఆరా తీశారు. తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ వెంకట్‌రాజాగౌడ్, సర్కిల్ పరిధిలోని ఎస్‌ఐలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

నర్సాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు మంగళవారం హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ శేషాచారి, ఐసీటీసీ కౌన్సిలర్ ధనశ్రీ, స్కోప్ సంస్థ ప్రతినిధి ఉమారాణి ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **పేద విద్యార్థినికి చేయూత**



మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రానికి చెందిన తాడేపు రమ్య చదువుకు అండగా ఉంటానని ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లక్ష్మణ్‌సింగ్ ఠాగూర్ ముందుకొచ్చారు. నగదుతో పాటు, నోట్ పుస్తకాలు, స్టేషనరీ వస్తువులను అందజేశారు. విద్యార్థి చదువుకు ప్రతీ సంవత్సరం రూ. 5 వేలు అందజేస్తాని హామీనిచ్చాడు. వీరి వెంట జిల్లా యువ మోర్చా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్, ప్రవీణ్, అనిల్, గణేశ్ తదితరులున్నారు.

◆ **తండ్రి, కొడుకుల దుర్మరణంతో విషాదం**



చిన్నశంకరంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో తండ్రి, కొడుకులు దుర్మరణం చెందడంతో మండలంలోని సూరారం గ్రామంలో విషాదం నెలకొంది. మంగళవారం చిన్నశంకరంపేట మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సిబ్బంది అటెండర్ మల్లేశం చిత్రపటానికి నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు. సూరారం గ్రామానికి చెందిన దొంతి మల్లేశం(35) చిన్నశంకరంపేట మండల పరిషత్ కార్యాలయంలో తాత్కాలిక ఉద్యోగిగా(అటెండర్) పనిచేస్తున్నాడు. తండ్రి భూదయ్య(75) ఆరోగ్యం బాగలేకపోవడంతో అస్పత్రిలో చూపిస్తానని బైక్‌పై తీసుకెళ్తున్న క్రమంలో వెనకనుంచి అతివేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో మల్లేశం అక్కడిక్కడే మృతి చెందగా, భూదయ్య అస్పత్రికి తరలించే క్రమంలో మృతి చెందాడు. దీంతో స్వగ్రామమైన సూరారంలో తీవ్రవిషాదం నెలకొంది.

◆ **చికిత్స పొందుతూ యువకుడి మృతి**



పాపన్నపేట(మెదక్): కరెంట్ షాక్‌తో తీవ్ర గాయాలైన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పాడిచన్‌పల్లిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పాపన్నపేట ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నార్లపల్లి ప్రభు(27) తన పొలం వద్ద స్టాటర్ రిపేర్ చేస్తుండగా కరెంట్ షాక్‌కు గురై, తీవ్ర గాయాల పాలయ్యాడు. రైతులు అతన్ని గమనించి ఆస్పత్రికి తరలించారు. హైద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. కుటుంబ భారం మోస్తాడనుకున్న కొడుకు అకాల మరణంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

◆ **పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ**

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని ముత్తాయికోట గ్రామానికి చెందిన గుండారం నర్సాగౌడ్ తన తండ్రి బుచ్చాగౌడ్ జ్ఞాపకార్థం మద్దుల్‌వాయి ప్రాథమిక పాఠశాలకు మైక్‌సెట్‌ను మంగళవారం అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, రఘుబాబు, సంతోషికుమారి, గ్రామ యువకులు పాల్గొన్నారు.

◆ **రైల్వే అండర్ పాస్ బ్రిడ్జిలోకి నీరు**

మిర్జాపల్లికి రాకపోకల బంద్...



చిన్నశంకరంపేట(మెదక్): మిర్జాపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జిలోకి నీరు చేరింది. దీంతో మిర్జాపల్లి గ్రామంలోకి రాకపోకలు నిలిచిపోయాయి. మిర్జాపల్లి చెరువులోకి నీరు పెరుగుతుండడంతో బ్రిడ్జిలోకి నీరు చేరడంతో రహదారికి ఇరువైపుల కంచెను పెట్టి రాహదారి మూసివేశారు. కాగా పంచాయతీ సిబ్బంది మోటార్ల ద్వారా నీటిని తొలగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.